


sahanamvande.com
epaper.sahanamvande.com
# సహనం వందే
హైదరాబాద్ | 12-10-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 169 EDITOR: ROHINI




# గాంధీయిజం... జెన్ జెడ్ స్వరం

## 'ప్రభుత్వాన్ని ధిక్కరించడం పౌరుడి బాధ్యత'



**దే**శ రాజధాని ఢిల్లీలో అసలు ఏం జరుగుతోంది? అహింస సిద్ధాంతంతో బ్రిటిష్ సామ్రాజ్యమే గడగడలాడిన రోజులను చూశాం. అవే ఆదర్శాలు నేడు మళ్లీ తెరపైకి రావడంతో ప్రభుత్వాలు హడలిపోతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ యువత చేస్తున్న శాంతియుత నిరసనలు, అరెస్టుల వెనుక ఉన్న బలం ఏంటి?

- సహనం వందే, న్యూఢిల్లీ

- 1922లో దేశద్రోహం కేసులో గాంధీ పిలుపు
- ఆ నినాదమే నేటి యువతకు వేదవాక్కు
- అహింసా వాదంతో కదం తొక్కుతున్న తరం
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ నిరసన
- ఉద్యమాలతో దద్దరిల్లిపోతున్న రాజధాని ఢిల్లీ

**ఢి**ల్లీలో జరుగుతున్న నిరసనల తీరు సరిగ్గా ఒక శతాబ్దం క్రితం జరిగిన చారిత్రక సంఘటనలను తలపిస్తోంది. 1922లో బ్రిటిష్ వలస పాలనా కాలంలో మహాత్మాగాంధీ కోర్టులో రాజద్రోహం విచారణను ఎదుర్కొంటూ... ప్రభుత్వ అన్యాయాన్ని శాంతియుతంగా ఎలా ధిక్కరించాలో చెప్పారు. 'ప్రభుత్వాన్ని ధిక్కరించడం పౌరుడి నైతిక బాధ్యత' అని ఎలుగెత్తి చాటారు. వందేళ్ల తర్వాత సరిగ్గా అదే సూత్రాన్ని ఒంటపట్టించుకుని ఈ యువత నిరసన బాట పట్టింది. నాటి సత్యాగ్రహంలాగే లాఠీలకు, భయాలకు లొంగకుండా శాంతియుత ధిక్కారాన్ని ప్రదర్శిస్తున్నారు.

### ఎన్నికల సంఘం పనితీరుపై అసంతృప్తి...

ఢిల్లీ వీధుల్లో నెలకొన్న ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణం ఎన్నికల సంఘం పనితీరుపై పెరుగుతున్న అసంతృప్తి. ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుముకగా ఉండాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించడం లేదనేది యువత ప్రధాన ఆరోపణ. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంపై నమ్మకం సన్నగిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని, ప్రజల ఓటు హక్కు పవిత్రతను కాపాడుకోవడానికి తాము రోడ్డెక్కాల్సి వచ్చిందని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు.

### దేశవ్యాప్త స్పందన... విశ్లేషకుల అభిప్రాయం

ఈ నిరసనలు కేవలం ఢిల్లీకి మాత్రమే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా ఉన్న యువత, మేధావులు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. రాజ్యాంగ సంస్థల పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కివేయడానికి బలప్రయోగంతో అణచివేయాలని చూడడం సరైన పద్ధతి కాదని, పారదర్శకతను పెంచడం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

### భవిష్యత్తుపై నిరసనల ప్రభావం

శాంతియుత నిరసన ద్వారా దేశ రాజకీయాల్లో ఒక కొత్త చర్చ ప్రారంభమైంది. అధికారం, పౌర హక్కుల మధ్య నిరంతరం సాగే సంఘర్షణలో నిశ్శబ్దంగా ఉండాల్సిన తరుణంలో గొంతెత్తి ప్రశ్నించిన ఈ యువత చరిత్రలో నిలిచిపోయే సందేశాన్నిచ్చింది. అధికారాన్ని ప్రశ్నించే ధైర్యమే ప్రజాస్వామ్యానికి పునాది. గాంధేయ మార్గంలో సాగుతున్న ఈ ధిక్కార స్వరం రాబోయే రోజుల్లో దేశ రాజకీయ, సామాజిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.



# వీళ్లు విజిలేస్తే వెయ్యి ముక్కలే

## ప్రపంచాన్ని మార్చేసిన రహస్య వీరులు

**దే**శంలో పన్నులు కట్టేది మనం, ఓట్లేసి నాయకులను గెలిపించేది మనం. కానీ అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే మూగప్రేక్షకుల్లా చూస్తూ ఉండిపోతున్నాం. ప్రజలకు ప్రభుత్వాలంటే భయం పోయి, బాధ్యతగా నడుచుకునే పరిస్థితి రావాలి. ఒక సంస్థలో లేదా ప్రభుత్వంలో జరిగే అవినీతి, అక్రమాలు, అన్యాయాలను గమనించి ధైర్యంగా సమాజానికి తెలియజేసే వ్యక్తులనే విజిల్ బ్లోయర్లు అంటారు. వీళ్లకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం ఉండదు; వీరి ఏకైక లక్ష్యం దేశ ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం మాత్రమే.

- సహనం వందే, హైదరాబాద్

- ప్రభుత్వాల గుండెల్లో విజిల్ బ్లోయర్లు
- ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజమైన హీరోలు



**ప్ర**పంచ చరిత్రలో విజిల్ బ్లోయర్లు చేసిన సంచలనాలు అన్నీఇన్నీ కావు. అమెరికా గుఢాచార సంస్థ పౌరుల కాల్స్, మెసేజ్‌లపై రహస్యంగా నిఘా పెడుతోందని ఎడ్వర్డ్ స్నోడెన్ ఆధారాలతో సహా బయటపెట్టారు. దెబ్బకు ప్రపంచ దేశాలన్నీ నిలదీయగా, వ్యక్తిగత గోప్యత ప్రాధాన్యత వెలుగులోకి వచ్చింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా పన్ను ఎగవేసే బడా నాయకులు, వ్యాపారవేత్తల నల్లధనాన్ని రట్టు చేసిన పనామా పేపర్స్ లీక్ వెనుక కూడా ఒక విజిల్ బ్లోయరే ఉన్నాడు. దీనివల్ల అనేక దేశాల్లో ప్రభుత్వాలు కూలిపోయాయి, ఎంతోమంది నేతలు విచారణను ఎదుర్కొన్నారు.

### భారతదేశంలో వీరుల త్యాగాలు

మన భారతదేశంలో సత్యేంద్ర దూబే జాతీయ రహదారుల నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టగా, ఐఓసీఎల్ అధికారి మంజునాథ్ కల్తీ పెట్రోల్ దందాను నిలదీశారు. వీరు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుళ్ళిపోయిన వ్యవస్థను సమాజం ముందుకు తీసుకువచ్చారు. సత్యం కంప్యూటర్స్ కుంభకోణంలో విజిల్ బ్లోయర్ పంపిన ఈమెయిల్ వల్లనే భారీ అకౌంటింగ్ మోసం వెలుగులోకి వచ్చి, కార్పొరేట్ కంపెనీలపై కఠిన నిబంధనలు వచ్చాయి. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వైద్య విద్య నియామకాలు, ఉద్యోగాల భర్తీలో జరిగిన వ్యాపం కుంభకోణాన్ని బయటపెట్టడం ద్వారా నియామకాల్లో పారదర్శకత పెరిగింది.

### ఆర్టీఐ చట్టం ద్వారా సాధికారత

భారతదేశంలో విజిల్ బ్లోయర్లు చేసిన పోరాటాల ఫలితంగానే మనకు సమాచార హక్కు చట్టం లభించింది. ఒక సామాన్య పౌరుడు కూడా ప్రభుత్వ ఆఫీసుల్లో ఏం జరుగుతుందో ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా వచ్చింది. అంతేకాక విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తెచ్చేందుకు కూడా వీరి పోరాటాలే కారణమయ్యాయి. నిజాలు చెప్పే వ్యక్తికి చట్టపరమైన రక్షణ ఉండాలని ఈ చట్టాలు చెబుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ అధికారుల్లో, పాలకుల్లో ఒకరకమైన భయం మొదలైంది.

### ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ

ప్రభుత్వాలు తప్పు చేసినప్పుడు ప్రజల కోపం కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకూడదు. విజిల్ బ్లోయర్లు ప్రతి శాఖలోనూ, ప్రతి గ్రామంలోనూ పుట్టుకురావాలి. ప్రాజెక్టుల పేరుతో నిధులు దారి మళ్లించినా ఆధారాలతో సహా బయటపెట్టే వ్యక్తులు పెరగాలి. నిఘా వ్యవస్థలు లేదా పోలీసులు పట్టుకోలేని కుంభకోణాలను లోపల ఉండే ఉద్యోగులే బయటకు తీయగలరు. తమ స్వార్థం చూసుకోకుండా, దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే విజిల్ బ్లోయర్లు ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం జీవించే ఉంటుంది.

# రష్మిక రగిలే... శ్రీలీల శివాలెత్తే!

## జాన్వీపై అసభ్య వీడియోల రగడ

**టె**క్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో మహిళలపై డిజిటల్ వేధింపులు ఒక పెద్ద సమస్యగా మారాయి. సోషల్ మీడియాలో ఆన్‌లైన్ హరాస్‌మెంట్, సైబర్ స్టాకింగ్, ఇమేజ్ బేస్డ్ అబ్యూస్, మార్ఫింగ్, బ్లాక్‌మెయిలింగ్ వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. ఏఐ సాయంతో నకిలీ ఫోటోలు, వీడియోలు తయారు చేయడం సులభంగా మారింది. ఈ రకమైన కంటెంట్ ను వైరల్ చేస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో మహిళలకు సరైన భద్రత ఉందో లేదో అని ఆలోచించాల్సిన సమయం ఇది.

- సహనం వందే, హైదరాబాద్

- ఏఐ ఫేక్ వీడియోలపై ఆగ్రహ జ్వాల
- కీర్తి సురేష్, చిన్మయి, ఖుష్బూ విమర్శలు
- ఆన్‌లైన్ హరాస్‌మెంట్... డిజిటల్ ముప్పు
- సమాజ బాధ్యతారాహిత్యంపై తీవ్ర ఆగ్రహం
- తారల ఆవేదనలతో ఊపందుకున్న చర్చ




**ఇ**టీవల సినీ రంగానికి చెందిన నటీమణులు కూడా ఈ తరహా ఏఐ వేధింపులకు గురై బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని ఒక పాట దృశ్యాలను ఏఐ టెక్నాలజీతో అసభ్యంగా మార్ఫింగ్ చేసిన ఘటన నెటిజన్లను షాక్‌కు గురిచేసింది. నటి జాన్వీ కపూర్ ఫోటోలు, వీడియోలను తప్పుగా చిత్రీకరించడం వల్ల వినోద రంగంలో మహిళల రక్షణపై చర్చ మొదలైంది. సమాజంలో గుర్తింపు ఉన్న వ్యక్తులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### హద్దులు దాటొద్దు... తారల ధ్వజం

ఈ అంశంపై జాన్వీ కపూర్ స్పందిస్తూ... మహిళల హద్దులు, ఆత్మగౌరవం అనేవి చర్చించాల్సిన విషయాలు కావని, ప్రతీ ఒక్కరూ వాటిని గౌరవించాలని చెప్పారు. అనుమతి లేకుండా నకిలీ కంటెంట్ తయారు చేయడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. నటి శ్రీలీల స్పందిస్తూ... టెక్నాలజీ మన జీవితాలను సులభతరం చేయడానికి ఉపయోగపడాలి తప్ప ఇతరులకు హాని కలిగించడానికి కాదన్నారు. సమాజంలో ఉన్న ప్రతీ మహిళకు గౌరవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే కీర్తి సురేష్ స్పందిస్తూ... ట్రోలింగ్, డీప్‌ఫేక్స్ ద్వారా తమ గొంతును నొక్కడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

### చిన్మయి, ఖుష్బూ, రష్మిక ఆగ్రహం

డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి స్పందిస్తూ... ఆన్‌లైన్ వేధింపుల వల్ల తన గొంతును ఎవరూ నొక్కలేరని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేసేవారు కూడా ఇలాంటి పనులకు పాల్పడుతుండడం అసహ్యం కలిగిస్తోందన్నారు. నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ స్పందిస్తూ... తాము పబ్లిక్ ఫిగర్స్‌మే కావచ్చు కానీ ఎవరి సొత్తు కాదని, గౌరవంగా బతికే హక్కు అందరికీ ఉందన్నారు. నటి రష్మిక మందన్న స్పందిస్తూ... ఏఐని తప్పుడు పనులకు వాడితే తీవ్ర నష్టం జరుగుతుందని, తప్పు చేసిన వారికి కఠినమైన శిక్షలు పడాలని కోరారు. నటి గౌరి కిషన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడంలో విఫలమవుతున్నాయని అభిప్రాయపడ్డారు.

### వేధింపుల వెనుక మానసిక రోగం

సైబర్ క్రైమ్ నిపుణురాలు ప్రగతి రతన్ స్పందిస్తూ... ఆన్‌లైన్ అబ్యూస్ అనేది అసూయ, అధికారం చెలాయించే మనస్తత్వం నుంచే వస్తుందని చెప్పారు. కొందరు టీములుగా ఏర్పడి మహిళలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. 20నుంచి 30ఏళ్ల మధ్య వారు ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలకు వెనుకాడొద్దని సూచించారు. నూతన ఐటీ నిబంధనల ప్రకారం ఫిర్యాదు వచ్చిన నిర్ణీత సమయంలోనే ఏఐ ఆధారిత నకిలీ, అసభ్యకర కంటెంట్‌ను సోషల్ మీడియా నుంచి తొలగించాల్సి ఉంటుంది.